- పరిశ్రమలో లీజు విధానాన్ని మారిస్తే ప్రభుత్వానికి ఆదాయం
- వైసీపీ ప్రభుత్వ పాలసీ వల్ల 460కి పైగా పరిశ్రమలు కుదేలు
- ఇబ్బందులు తొలగిస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన చంద్రబాబు, లోకేశ్
- మంత్రి బీసీపై కార్మికుల ఆశలు
- ఎదురు చూస్తున్న పరిశ్రమల యజమానులు





కొలిమిగుండ్లలోని నాపరాయి పరిశ్రమ

నాపరాయికి మంచి కాలం

నంద్యాల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో బనగానపల్లెలోని నాపరాయి పరిశ్రమ కుదేలైంది. సెక్యూరిటీ డిపాజిట్లు, రెంట్లు, ప్రీమియం టాక్స్, రాయల్టీ పెంచడంతో పరిశ్రమ యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ ప్రభుత్వం వస్తే జగన్ తెచ్చిన చెత్త జీవోలన్నీ రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగిస్తామని, రెంటు, రాయల్టీ తగ్గిస్తామని, లీజు విధానాన్ని మార్చి నాపరాయి పరిశ్రమలను ఆదుకుంటామని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. నాపరాయి పరిశ్రమ విషయంలో 2014లో అమలు చేసిన విధానాలనే తీసుకువచ్చి ఆదుకుంటామని ఎన్నికలకు ముందు బనగానపల్లె సభలో నేత నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ పరిస్థితి మారుతుందని పరిశ్రమల యజమానులు ఆశిస్తున్నారు. లీజు, రెంటు, రాయల్టీ విధానంలో ఎలాంటి మార్పు తీసుకొస్తే తమ పరిశ్రమలు సంక్షోభం నుంచి బైటపడతాయని 460కి పైగా పరిశ్రమల యజమానులు ఎదురు చూస్తున్నారు.

బనగానపల్లె నియోజకవర్గం ముఖ్యంగా కొలిమిగుండ్ల ప్రాంతంలో నాపరాయి పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిశ్రమ వేల మంది ఉపాధి పొందేవారు. 2014 నుంచి 2019 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వం నాపరాయి పరిశ్రమకు అనుకూలంగా చాలా నిర్ణయాలు తీసుకుంది. రాయల్టీని చదరపు అడుగుకు రూ.8 నుంచి రూ.5కి తగ్గించింది. అలాగే 30 శాతం ఉన్న డీఎంఎఫ్ (డిస్ట్రిక్టు మినరల్ ఫండ్)ను 10 శాతానికి తగ్గించింది. డెడ్ రెంటు హెక్టారుకు రూ.40 వేలు ఉండేది. ఈ మొత్తాన్ని రాయల్టీలో మినహాయించుకునే వెసులుబాటు ఉండేది. అయితే గత వైసీపీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ పరిశ్రమ తీవ్ర ఒడిదుడుకులకు లోనయింది. హెక్టారుకు రూ.40 వేలు ఉన్న డెడ్ రెంట్ (వార్షిక బాడుగ)ను రూ.52 వేలకు పెంచి నాపరాయి పరిశ్రమల నడ్డి విరిచింది. డెడ్ రెంట్ బిల్లులను ఇవ్వకుండా సతాయించింది. ఇక గతంలో ఉన్న లీజు విధానాన్ని తీసేసి, వేలం పద్ధతిని తీసుకువచ్చింది. పైగా మైనింగ్‌ను సొంతం చేసుకోవాలంటే అడ్వాన్స్ డెడ్ రెంటు పది రెట్లు అధికంగా ప్రీమియంగా చెల్లించటమే కాకుండా, డెడ్ రెంటుకు మూడు రెట్ల మొత్తాన్ని సెక్యూరిటీ డిపాజిట్ చేయాలని నిబంధన తీసుకువచ్చింది. దీనివల్ల బాగా డబ్బు ఉన్న వారు మాత్రమే వేలంలో పాల్గొనే పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు భారీ పరిశ్రమలకు విధించాల్సిన నిబంధనలను చిన్న పరిశ్రమైన నాపరాయి పరిశ్రమపై విధించడం వల్ల గనుల యజమానులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. దీంతో చాలామంది తమ పరిశ్రమలను మూసేసుకున్నారు. వీటిపై ఆధారపడిన వేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

పెరిగిపోయిన అవినీతి..

జిల్లాలో వందలాది నాపరాయి పరిశ్రమలు ఉండగా, దాదాపు 500 పైగా పరిశ్రమలకు లీజులు ఉన్నాయి. అయితే గత ప్రభుత్వం తీసుకువచ్చిన విధానాల వల్ల 40 పరిశ్రమలు మాత్రమే కొనసాగుతున్నాయి. మిగిలిన దాదాపు 460కి పైగా పరిశ్రమలకు సంబంధించిన దస్త్రాలు అనుమతుల పేరిట సంబంధిత శాఖ కార్యాలయాల్లో మూలుగుతున్నాయి. ఇక కొత్తగా మైనింగ్‌కు సంబంధించి అనుమతులు కూడా సకాలంలో రావటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీటి అనుమతుల కోసం పరిశ్రమల యజమానులు డీఎంఓ, డీఎంజీ ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నారు. అనుమతులు రాకపోవటానికి కారణం సంబంధిత కార్యాలయాల్లో పూర్తిగా లంచాలు పెరిగిపోవటం కూడా ఓ కారణమన్న విమర్శలు లేకపోలేదు. సంబంధిత కార్యాలయాల్లో ప్రతి పనికి ఓ రేటు ఫిక్స్ దోచుకుంటున్నారని, దీనివల్ల అనుమతుల కోసమే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అనుమతులకే లక్షల్లో ఖర్చు చేయాల్సి రావటం, ఇక పరిశ్రమను నడిపించేందుకు ఇంకొన్ని లక్షలు ఖర్చు చేయాల్సి రావడంతో చాలా మంది నాపరాయి పరిశ్రమ అంటేనే భయపడే స్థాయికి చేరుకున్నారు.

అధికార పార్టీపైనే ఆశలు...

నాపరాయి పరిశ్రమను ఆదుకోవడానికి ప్రస్తుత ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో రద్దు చేస్తూ 2014లో అమలు చేసిన విధానాలనే అమలు చేస్తామని ఒక్క జీవో విడుదల చేస్తే చాలు. దీనివల్ల వందల్లో పెండింగ్ ఉన్న పరిశ్రమలకు అనుమతులు వస్తాయి. మూతపడిన పరిశ్రమలు మళ్ళీ తెరుచుకుంటాయి. దీనివల్ల కార్మికులకు ఉపాధి దొరుకుతుంది. పైగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. బనగానపల్లె నియోజకవర్గం నుంచి గెలిచిన బీసీ జనార్దన్‌రెడ్డి ఇక్కడి నాపరాయి పరిశ్రమను ఆదుకోవాలని వాటి యజమానులు కోరుతున్నారు. డెడ్ రెంటును పది రెట్లు, సెక్యూరిటీ డిపాజిట్లు 3 రెట్లు కడితేనే లీజును పొడిగించే విధానాన్ని మార్చాలి. లీజు అనుమతులు వచ్చిన తర్వాత పర్యావరణ అనుమతులు త్వరగా వచ్చేలా చూడాలి. కొత్తగా మైనింగ్‌కు వేలం పద్ధతిని తీసివేసి పాత విధానాన్నే కొనసాగించాలి. కరోనా తర్వాత కన్సిడరేషన్ ట్యాక్స్ 400 రెట్లు పెంచారు. దీనిని తీసివేయాలి. పరిశ్రమకు సంబంధించి 5 హెక్టార్లకు మాత్రమే పరిమితమైన ప్రజాభిప్రాయ సేకరణ 10 హెక్టార్లకు పెంచాలి. పొల్యూషన్ సీఎఫ్ఓ ట్యాక్స్‌ను దాదాపు 1000 రెట్లు పెంచారు. దీనిని తీసేసి పాత విధానంలోనే కొనసాగించాలి. కొత్త దరఖాస్తులు ఆరునెలల్లో ఆమోదించాలి. పాత పద్ధతి ప్రకారం ఎండీఎల్ నుంచి ఎండీఎల్‌కు బదిలీ అయ్యే విధంగా చూడాలి.



తప్పకుండా న్యాయం చేస్తాం

నాపరాయి పరిశ్రమల విషయంలో మా హామీని కచ్చితంగా నిలబెట్టుకుంటాం. పరిశ్రమల యజమానులు కోరిన విధంగానే వైసీపీ విధానాలను తొలగించి పాత పద్ధతినే కొనసాగిస్తాం. సంబంధిత శాఖలో అవినీతిని ప్రభుత్వం అరికడుతుంది.

బీసీ జనార్దన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ మంత్రి



సమస్యలను పరిష్కరించండి

ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

నంద్యాల క్రైం, ఆగస్టు 19: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం నంద్యాల జిల్లా కేంద్రంలోని బొమ్మలసత్రంవద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధితుల నుంచి సమస్యలను అర్జీల రూపంలో ఎస్పీ అందుకున్నారు. ఫిర్యాదుదారుల సమస్యలు విని నేరుగా సంబంధిత అధికారులతో ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. వీలైనంత త్వరగా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనని స్పష్టం చేశారు. కాగా సివిల్ తగాదాలు, అత్తారింటి వేధింపులు, కుటుంబ కలహాలు, అన్నదమ్ముల ఆస్తి పంపకాల్లో మనస్పర్థలు తదితర అంశాలపై ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

అర గంటలోనే మార్పు

- ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్న ఎం.కేశవ
- ఆ వెనువెంటనే ఉన్నతాధికారుల నుంచి ఫోన్ కాల్
- జిల్లా పోలీసు కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ఎం. కేశవ

జూపాడుబంగ్లా, ఆగస్టు 19: జూపాడుబంగ్లా ఎస్ఐగా ఎం.కేశవ్ బాధ్యతలు తీసుకున్న అర గంటలోనే మార్పు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మీనారాయణను నంద్యాల త్రీటౌన్‌కు బదిలీ చేసి కర్నూలు ఎలక్షన్ సెల్‌లో పని చేస్తున్న ఎం.కేశవను ఇక్కడికి నియమించారు. ఈ మేరకు సోమవారం జూపాడుబంగ్లా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బాధ్యతలు తీసుకున్న అర గంటలోనే ఉన్నతాధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అక్కడి నుంచి వచ్చేయాలని, ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని చెప్పడంతో ఎస్ఐ కేశవ నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లినట్లు సమాచారం. జూపాడుబంగ్లా ఎస్ఐగా తిరిగి లక్ష్మీనారాయణనే కొనసాగించినట్లు తెలుస్తోంది. ఇలా అరగంటలోనే మార్పు చేయడం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. రాజకీయ జోక్యంతోనే మార్పు జరిగినట్లు చర్చ సాగుతోంది. ఇటీవల నందికొట్కూరు రూరల్ సీఐ బదిలీ విషయంలో కూడా ఇదే జరిగింది. దీంతో రాజకీయ నాయకుల పుణ్యమా అని అధికారుల బదిలీల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

భ్రమరాంబకు లక్ష కుంకుమార్చన

శ్రీశైలం, ఆగస్టు 19: శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబ అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ముందుగా పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. లక్ష కుంకుమార్చనకు పరోక్ష సేవ ద్వారా దేవస్థానం అవకాశం కల్పించింది. శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీశైలం క్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం నిర్వహించాల్సిన గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని వర్షం కారణంగా నిలిపివేశారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో సోమవారం రంగారెడ్డికి చెందిన స్పందన డాన్స్ అకాడమీ సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకుంది.



స్వామి, అమ్మ వార్లకు ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

మోదీ పాలనలో దేశం అధోగతి

- మతతత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తున్న బీజేపీ
- పేదరికం పెరిగిందే తప్ప అభివృద్ధి లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

డోన్, ఆగస్టు 19: ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందకపోగా అధోగతి పాలైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బీజేపీ మతతత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం డోన్ పట్టణంలోని లక్ష్మి ఫంక్షన్ హాలులో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అధ్యక్షతన జిల్లా పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోదీ అహంకార పాలన సాగిస్తూ దేశంలో ప్రతిపక్ష పార్టీలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. హిందూ దేశంగా మార్చాలని ప్రధాని మోదీతోపాటు బీజేపీ నాయకులు ఇతర మతాలపై దాడులు చేయడం చాలా దారుణమన్నారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి చెందకపోగా.. పేదరికం పెరిగిపోయిందన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో చెరువులకు నీళ్ల నింపాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్య, కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మనసు పెట్టి పని చేయండి

కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 19: ప్రజా సమస్యల పరిష్కార వేదిక, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులు కూడా రీ ఓపెన్ అవుతున్నాయని జిల్లా అధికారులు మనసుపెట్టి తెలివితో విధులు నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రత్యేక ఓటర్ల నమోదు, పీఎం విశ్వకర్మయోజన దరఖాస్తుల స్వీకరణ, సాధారణ బదిలీలు తదితర అంశాలపై అధికారులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పని తీరు బాగాలేదని, అస్తవ్యస్తంగా ఉందని... సమయ పాలన పాటించకుండా వచ్చి వెళ్లడం విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే తీరు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లు సంబంధిత హెచ్ఓడీలు నియంత్రణలోనికి తీసుకుంటూ సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం: ఈనెల 18 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా ఇంటింటికి తిరిగి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని రెవెన్యూ, బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ సంబంధించి పరిశీలించి నివేదికలు ఇవ్వాలని తహసీల్దార్లకు సూచించారు. పీఎం విశ్వకర్మ పథకం కింద వంశపారంపర్యంగా 18 కులవృత్తుల వాళ్లను ప్రోత్సహించి గుర్తింపు కార్డు, శిక్షణ, ఉచిత పనిముట్లు పంపిణీ చేస్తోందని కలెక్టర్ అన్నారు. ఇందుకు సంబంధించి 51,920 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఇందులో 43 వేల దరఖాస్తులు అర్హత లేనివని, క్షేత్రస్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు స్వయంగా పరిశీలించి వాస్తవ నివేదికలు 23వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పీజీఆర్ఎస్: ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యత నిచ్చి నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాల్గొని వివిధ జిల్లాల నుంచి వచ్చిన అర్జీలను కలెక్టర్, జేసీ విష్ణుచరణ్, డీఆర్వో పద్మజ స్వీకరించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 150 మంది తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్‌కు అర్జీలు సమర్పించుకున్నారు.

మయూర వాహనంపై ప్రహ్లాదరాయలు

- మూల రాములకు కనకాభిషేకం
- శాఖోత్సవం చేసిన పీఠాధిపతి
- కొనసాగుతున్న సప్తరాత్రోత్సవాలు

మంత్రాలయం, ఆగస్టు 19: శ్రీగురు మహిమాన్విత క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం ప్రహ్లాదరాయలు మయూరవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. మూలరాములకు కనకాభిషేకం చేసిన దృశ్యం భక్తులను కనువిందు చేసింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజిత గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పల్లకిలో ఊరేగింపుతో వచ్చి నూతనంగా బెంగుళూరు చెందిన నాగరాజు అను భక్తుడు నిర్మిస్తున్న యాగశాలలో ఊంజల సేవలో అధిష్టించి పీఠాధిపతి శాఖోత్సవం చేసి మహమంగళహారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో మఠం ప్రాంగణం మార్మోగింది. బృందావనాన్ని బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, గులాబి ప్రత్యేక పుష్పాలతో శోభాయానుమానంగా అలంకరించి పీఠాధిపతి మహా మంగళహారతి ఇచ్చారు. రాఘవేంద్ర సర్కిల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ కార్యక్రమంలో విద్వాన్ రాజా ఎస్.గిరిరాజాచార్, సుజీంద్రాచార్, గౌతమాచార్, ఆనంద తీర్థాచార్, ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, శ్రీపతిఆచార్, సూపరింటెండెంట్ రవి కులకర్ణి, సీఆర్‌వోలు విజయేంద్రాచార్, స్కెచ్ రాఘవేంద్ర, జయతీర్థాచార్, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్, ద్వారపాలక అనంత స్వామి, ప్రకాష్ ఆచార్, బీఎం ఆనందరావు, మంత్రాలయం సీఐ రామాంజులు ఎస్ఐ గోపినాథ్, వాదిరాజాచార్ పాల్గొన్నారు.

నేడు పూర్వారాధన

రాఘవేంద్రస్వామి ఉత్సవాల్లో ముఖ్యమైన పూర్వారాధన ఘట్టం మూడో రోజు మంగళవారం జరగనుంది. రాత్రి యోగీంద్ర కళా మండపంలో సాయంత్రం నుంచి కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు. రాత్రి రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి అవార్డులను ముగ్గురు విద్వాంసులకు పీఠాధిపతి ప్రదానం చేయనున్నారు.



మయూర వాహనంపై దర్శనం ఇచ్చిన ప్రహ్లాదరాయలు

ఆకట్టుకున్న భరత నాట్యం: సోమవారం రాత్రి యోగీంద్ర కళా మండపంలో పుత్తూరు చెందిన నృత్య పాసన కళా అకాడమీ బృందంచే భరతనాట్యం, మైసూరు చెందిన విద్యవిందచే నాగలహరి సంగీత కచేరి, బెంగళూరుకు చెందిన నరసింహనాయక్‌చే దాసవాని సాహిత్యం భక్తులను ఆకట్టుకుంది. కళాకారులకు పీఠాధిపతి శేషవస్త్రం, మెమెంటో, నగదు, ఫలపుష్ప మంత్రాంక్షితలు ఇచ్చి సత్కరించారు.



భరతనాట్యం చేస్తున్న పుత్తూరు కళాకారులు



నూతన యాగశాలలో ప్రహ్లాదరాయల ఊంజల సేవ

దివికేగిన సాహితీ దిగ్గజం

కాశీభట్ల వేణుగోపాల్‌కు ప్రముఖుల నివాళి


కాశీభట్ల వేణుగోపాల్ (ఫైల్)

కర్నూలు(కల్చరల్), ఆగస్టు 19: కర్నూలుకు చెందిన ప్రముఖ కవి, సాహితీవేత్త కాశీభట్ల వేణుగోపాల్ (72) సోమవారం వేకువ జామున కన్నుమూశారు. నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల సొంత ఇంటిలో ఒంటరిగా జీవిస్తున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాశీభట్ల మృతి చెందారని తెలుసుకున్న పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం కర్నూలు సాహితీ ప్రపంచానికి తీరని లోటని పేర్కొన్నారు. సోమవారం కాశీభట్ల స్వగృహంలో ఆయన పార్థీవ దేహానికి పలువురు కవులు, కళాకారులు, నగర ప్రముఖులు నివాళులర్పించారు. సాహిత్య రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. సోమవారం మధ్యాహ్నం కర్నూలు పాతనగరంలోని జమ్మిచెట్టు సమీపంలోని హిందూ శ్మశాన వాటికలో కాశీభట్ల వేణుగోపాల్ అంత్యక్రియలు జరిగాయి. బంధువులు, స్నేహితులు, సాహిత్యాభిమానులు కన్నీటి పర్యంతం మధ్య అశ్రునివాళులతో ఆయనకు తుది వీడ్కోలు పలికారు.

కవులు, రచయితలు, కళాకారుల నివాళి

కాశీభట్ల మృతి పట్ల జిల్లాకు చెందిన కవులు, రచయితలు, కళాకారులు నివాళులర్పించారు. ఆయన రచనలు మానవ సంబంధాలకు ఆనవాళ్లుగా నిలుస్తాయని, ఆయన రచనలను భద్రపరచి భావి తరాలు చదువుకునే అవకాశం కల్పించాలని కథా సమయం సంస్థ రచయిత ఇనాయతుల్లా అభిప్రాయపడ్డారు. 1990లో ఆయన రాసిన తపన నవల తానా సంస్థ నుంచి అప్పట్లో రూ.లక్ష గెలుపొందిందని, కాశీభట్ల హైస్కూలు విద్య నుంచీ క్లాస్‌మేట్ కావడం తన అదృష్టమని మధురకవి ఎలమర్తి రమణయ్య గుర్తు చేసుకున్నారు. సాహితీ రంగంలో ఆయన ప్రస్థానం అసామాన్యంగా సాగిందని చెప్పారు. సినీనటుడు తనికెళ్ల భరణి, సినీ దర్శకుడు వంశీ వంటి వారితో మంచి పరిచయాలు ఉండేవని, తనికెళ్ల అనేక సార్లు కాశీభట్ల స్వగృహానికి వచ్చారని తెలిపారు. కర్నూలులో పుట్టిన కాశీభట్లకు ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని, కానీ ఆయన రచనలు గొప్పగొప్ప కవులనే మెప్పించాయని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణియాదవ్, కవులు వెంకటకృష్ణ, డాక్టర్ ఎం. హరికిషన్, తెలుగు వెంకటేశ్ కొనియాడారు. జిల్లా సాహిత్య రంగంలో కాశీభట్ల ఒక మహోన్నత కవిత్వ శిఖరమని శ్లాఘించారు. కాశీభట్ల మృతి సాహితీరంగానికి తీరని లోటని పద్మశ్రీ ఘంటసాల గానకళా సమితి, తెలుగు భాషా వికాస ఉద్యమం, తెలుగు కళాసమితి ప్రతినిధులు సుస్వరం వాసుదేవమూర్తి, డాక్టర్ పి. చంద్రశేఖర్, కేసీ కల్కూర, జేఎస్ఆర్‌కే శర్మలు కొనియాడారు.

పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు లోడింగ్ కార్మికులు

బేతంచెర్ల, ఆగస్టు 19: మండలంలోని హెచ్. కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న ముచ్చట్ల బిల్కు నాగేశ్వరరావు గని వద్ద పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ రమేష్ (32) అక్కడికక్కడే మృతి చెందాడు. ఇద్దరు లోడింగ్ కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సంఘటన సోమవారం సాయంత్రం జరిగింది. డోన్‌కు చెందిన ట్రాక్టర్ చిప్స్ ఫ్యాక్టరీకి కలర్ బొగ్గడ రాళ్లను తీసుకుని వెళ్లేందుకు ముచ్చట్ల బిల్కు నాపరాళ్ల గనుల వద్దకు వచ్చారు. అంతలోనే ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ట్రాక్టర్ కింద డ్రైవర్ రమేష్, లోడింగ్ కార్మికులు శ్రీను, మరో వ్యక్తి కూర్చుని ఉండగా.. పిడుగుపాటుకు ట్రాక్టర్ డ్రైవర్ రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. లోడింగ్ కార్మికులు అక్కడి నుంచి పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. రమేష్ స్వగ్రామం కొచ్చెర్వు కాగా, గత 13 ఏళ్లుగా డోన్ లో నివాసముంటున్నాడు. మృతునికి భార్య లీలావతి, కొడుకు కూతురు ఉన్నారు.

సారా వ్యాపారి హత్య

● నాగనాథనహళ్లి ఘటన మరవక ముందే పెద్దహరివాణంలో..

ఆదోని రూరల్ ఆగస్టు 19 : అర్ధరాత్రి సారా వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన పెద్ద హరివాణంలో ఇంటి బయట కట్టపై సోమవారం జరిగింది. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన ఉప్పర శేకన్న(50) కర్ణాటక మద్యం, సారా వ్యాపారం చేస్తున్నాడు. 30 సంవత్సరాల క్రితం బళ్లారి జిల్లా శిరుగుప్ప తాలుకా ఉప్పర హాళ్ గ్రామానికి జయమ్మతో వివాహమైంది. జయమ్మకు పిల్లలకు కాకపోవడంతో సమీప బంధువు కర్ణాటక రాష్ట్రం గంగావతి పక్కన ఉన్న పాత డణాపురానికి చెందిన గంగమ్మను 17 సంవత్సరాల క్రితం శేకన్న రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఇద్దరు మగ పిల్లలు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు భార్యలు, పిల్లలతో కలిసి శేకన్న ఒకే ఇంట్లో ఉంటూ, కర్ణాటక మద్యం, సారా విక్రయిస్తూ, కుటుంబాన్ని పోషించుకున్నాడు. ఇతని వ్యాపారానికి గత వైసీపీ ప్రభుత్వం పూర్తి అండగా ఉండేది. ప్రభుత్వం మారాక శేకన్న రెండు నెలల క్రితం ఇద్దరు భార్యలతో కలిసి బెంగుళూరుకు వలస వెళ్లాడు. బెంగుళూరులో రెండవ భార్య గంగమ్మ, శేకన్నల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆమె పుట్టింటికెళ్లి సమీప కర్ణాటక పోలీస్‌స్టేషన్‌లో భర్త శేకన్నపై ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా, 15రోజుల క్రితం శేకన్న పెద్ద భార్య జయమ్మతో కలిసి సొంతూరు పెద్దహరివాణం చేరుకున్నాడు. ఈనెల 12వ తేదిన గ్రామ వైసీపీ నాయకులతోపాటు శేకన్నకు బీజేపీ కండువా వేసి ఎమ్మెల్యే పార్థసారథి పార్టీలో చేర్చుకున్నాడు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి బయట కట్టపై గుర్తు తెలియని దుండగులు గొంతుకోసి శేకన్నను అత్యంత దారుణంగా చంపేశారు. గ్రామానికి చెందిన సారా డాన్‌కు, మృతుడికి మధ్య విబేధాలు ఉన్నట్లు కూడ తెలుస్తోంది. పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హత్య ప్రదేశంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా దర్యాప్తు చేపట్టామని డీఎస్పీ సోమన్న తెలిపారు.


శేకన్న (ఫైల్)

నా భర్తకు రెండో పెళ్ళి నేనే చేశా

నాకు పిల్లలు కాకపోవడంతో నా భర్త శేకన్నకు మా చిన్నతాత మనవరాలు గంగమ్మను 17 సంవత్సరాల క్రితం ఇచ్చి వివాహం చేశాను. అప్పటి నుండి మేమంతా కలిసి ఉంటున్నాము. నా భర్త ఆదివారం రాత్రి మాతోపాటు అన్నం తిని పడుకున్నాడు. 12గంటల సమయంలో డోర్ తెరిచి ఉండడంతో బయటకెళ్లి చూశా. కట్టపైన నా భర్త పడుకొని ఉన్నట్లు గుర్తించి బెడ్‌షీట్ కప్పబోయాను. రక్తం కనిపించి అందరినీ పిలిపించాను.

-జయమ్మ, మొదటి భార్య, పెద్దహరివాణం

నా భర్త నన్ను అనుమానించేవాడు

నా భర్త శేకన్న నన్ను ఎప్పుడూ అనుమానించేవాడు. 20రోజుల క్రితం బెంగుళూరులో ఉండగా, నన్ను అనుమానించి వేధించాడు. నేను మా పుట్టినిల్లు కర్ణాటకలో పోలీసులకు ఫిర్యాదు చేశాను. నా భర్త మృతి చెందాడని తెలిసి సోమవారం వచ్చాను.

- గంగమ్మ, రెండో భార్య, పెద్ద హరివాణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

నల్లమలలో కన్నడ శిలాశాసనం మాయం

● 17 ఏళ్లుగా పట్టించుకోని అధికార గణం

● అంతరించిపోతున్న పురాతన ఆలయాల చరిత్ర

ఓర్వకల్లు, ఆగస్టు 19 : ఓర్వకల్లు మండల పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఓ శిలాశాసనం మాయమైంది. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లె మజరా గ్రామమైన గుమ్మితం తండా పరిసరాల్లోని రెండు కొండల మధ్య సుమారు 400 ఏళ్ల కిందటి ఆలయాలు ఉన్నాయి. వీటి కింద కోనేటి ఉంది. ఆలయం పైభాగాన 12, 13వ శతాబ్దానికి చెందిన కన్నడ, సంస్కృత భాషలు, తెలుగు అక్షరాలతో శిలాశాసనం ఉండేది. అయితే 2007లో శిలాశాసనంతో పాటు వీరభద్ర విగ్రహాన్ని గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకొని వెళ్లినట్లు సమాచారం. ఈ ఆలయాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఉండగా.. ఆలయాలకు 23 ఎకరాల దేవుడి మాన్యం భూమి ఉంది. ఈ ఆలయాల పరిసర ప్రాంతాల్లో గ్రీన్‌కో సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణ పనుల వల్ల ఆలయాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో గ్రామస్తులు నిరసనన కార్యక్రమాలు చేపట్టగా గ్రీన్‌కో అధికారులు రూ.2 కోట్లతో నూతనంగా ఆలయం నిర్మాణం చేపట్టి రహదారి కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకూ హామీని నెరవేర్చలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా శిలాశాసనం మాయమై 17 ఏళ్ల గడుస్తున్నా దేవదాయ, పురావస్తు శాఖల అధికారులు ఈ విషయం పట్టించుకోకపోవడం గమనార్హం.


కనుమరుగైన శిలాశాసనం (ఫైల్)

ఉరుకుంద క్షేత్రంలో అసౌకర్యాలు

● అడుగడుగునా భక్తుల నిలువు దోపిడీ

● దేవాలయం వద్ద కానరాని పరిశుభ్రత

● అవినీతిని అరికట్టడంలో అధికారులు విఫలం


కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం, ఆగస్టు 19: ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారు. ఈ దేవాలయానికి ఒక్క శ్రావణమాసంలో దాదాపు 20 నుంచి 25 లక్షల మంది భక్తులు వస్తుంటారు. మూడవ సోమవారం ఒక్క రోజే దాదాపు 3 లక్షల మంది భక్తులు వచ్చారు. ఆదివారం నుంచి ఏకధాటిగా భక్తులకు దర్శనం కల్పించారు. అయితే భక్తులు ఆలయం వద్ద అన్ని చోట్ల నిలువు దోపిడీకి గురవుతున్నా అరికట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలో భక్తుల నుంచి క్షురకులు ఒక్కొక్కరికి వంద రూపాయలు వసూలు చేస్తున్నారు. తలనీలాలకు దేవాలయం వారు నిర్ణయించింది రూ.40. కానీ క్షురకులు మాత్రం వంద ఇవ్వనిదే గుండు కొట్టడం లేదు. ఆలయ అధికారులు దాదాపు రూ.4లక్షలకు నీటి సరఫరా కాంట్రాక్ట్ ఇచ్చినా భక్తులకు తాగునీరు అందడం లేదు. సుమారు 15 నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నా సోమవారం 8 ట్యాంకర్లు మాత్రమే కనిపించాయి. ఇవి ఏమాత్రం సరిపోకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. నీటి కోసం ప్రైవేటు వ్యక్తుల నుంచి బిందె నీటికి రూ.40 చెల్లించి నీటిని కొనుగోలు చేశారు. దేవాలయ అధికారులు భక్తులు తాగునీరు సరఫరా చేయకపోవడంతో బిందె నీటిని రూ.40 ఇచ్చి కొన్నానని జంపాపురం గ్రామానికి చెందిన అంజినయ్య తెలిపారు.


నీరు లేక పిల్లలకు స్నానం చేయించేందుకు అవస్థలు పడుతున్న మహిళ

టెంకాయల వద్దా నిలువు దోపిడే

ఆలయ అధికారులు నిర్ణయించిన ధర ప్రకారం టెంకాయ రూ.20కు విక్రయించాలి. కానీ అక్కడ వ్యాపారులు మాత్రం రూ.30 నుంచి రూ.35లకు అమ్ముతున్నారు. హోటళ్లలో ప్లేటు టిఫిన్ ఏదైనా సరే రూ.50. కనీసంగా నాణ్యత ఉండటం లేదు. దర్శన టికెట్ ధరల కౌంటర్ దగ్గర నుంచి ఆలయ ముఖద్వారాల వద్ద కూడా పారిశుధ్య లోపం కనిపిస్తోంది. పరిసరాలు దుర్వాసన అధికారులు చేతులు ఎత్తేశారు. ఎల్ఎల్‌సీ కాలువ వద్ద మురికి నీటిలోనే భక్తులు పుణ్యస్నానాలు చేశారు. మహిళలు బట్టలు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన తడికెల గదులు నాసిరకంగా ఉన్నాయి. దీంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

పిడుగు పాటుకు జీవాలు మృతి


పిడుగు పాటుకు మృతి చెందిన జీవాలు

అవుకు, ఆగస్టు 19 : అవుకు మండలం సంగపట్నం గ్రామ సమీపంలో పిడుగు పడి 47 జీవాలు మృతి చెందాయి. ఈ ఘటన సోమవారం జరిగింది. దాదాపు రూ. 4 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు గుడిసె వెంకటేశ్వర్లు విలపించాడు. సంగపట్నం గ్రామానికి చెందిన గుడిసె వెంకటేశ్వర్లు ఉదయం జీవాలను మేపుకొనేందుకు గ్రామ సమీపంలోని కొండ ప్రాంతానికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. ఆ సమయంలో జీవాలు చెట్టు కిందికి చేరుకున్నాయి. ఆ సమయంలో పిడుగు పడి జీవాలు మృతి చెందాయి. టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ. ఉగ్రసేనారెడ్డి, కొలిమిగుండ్ల, అంకిరెడ్డి పల్లె టీడీపీ నాయకులు హుశేన్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

కొలిమిగుండ్ల, ఆగస్టు 19: మండలంలోని బెలుం గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బనగానపల్లె మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రాజశేఖర్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు కిశోర్‌కుమార్(15), బనగానపల్లె మండలం చెర్వుపల్లె గ్రామానికి చెందిన గద్దె ప్రభుదాస్(22) మృతి చెందారు. కాగా ప్రభుదాస్ బెలుం గ్రామంలో ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం తన సమీప బంధువుల అబ్బాయి కిశోర్‌కుమార్‌ను పనికి వెంట తెచ్చుకున్నారు. కిశోర్‌కుమార్ 9వ తరగతి చదువుతూ ఇటీవలే పాఠశాలకు వెళ్లడం మానేశాడు. ఈ క్రమంలో ఆదివారం గనుల్లో ఆపరేటర్ పని ముగించుకుని అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇద్దరూ మోటార్‌సైకిల్‌పై బెలుం గుహల వద్ద రూముకు వెళ్తుండగా మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన వారిని స్థానికులు 108 వాహనంలో బనగానపల్లెకు తరలించారు. అక్కడి నుంచి కర్నూలు ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రభుదాస్ మృతి చెందగా, చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున కిశోర్‌కుమార్ మృతి చెందాడు. కాగా ప్రభుదాస్‌కు గత 8నెలల క్రితమే విజయలక్ష్మి అనే యువతితో వివాహం జరిగింది. రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచి వేయడం పలువురిని కలచివేసింది. కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌చార్జి డీఆర్వోగా చిరంజీవి

కర్నూలు(కలెక్టరేట్), ఆగస్టు 19: జిల్లా ఇన్‌చార్జి డీఆర్వోగా చిరంజీవి నియమితులయ్యారు. ప్రస్తుత డీఆర్వో మధుసూదన్‌రావు అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. సోమవారం నుంచి ఈ నెల 24 వరకు సెలవుపై వెళ్లడంతో చిరంజీవిని నియమించారు. ప్రస్తుతం ఈయన ఎన్‌హెచ్-44 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్నారు.

కుందూలో పడి వ్యక్తి గల్లంతు

పాణ్యం, ఆగస్టు 19 : మండలంలోని తొగర్చేడు గ్రామ సమీపంలో కుందూలో పడి మిద్దూరు వెంకటేశ్వర్లు (52) ప్రమాదవశాత్తు పడి గల్లంతయినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం వెళ్లి కాలుజారి పడి గల్లంతయినట్లు తెలిపారు. ఈమేరకు పోలీసులు గాలిస్తున్నారు.

ఎస్సార్బీసీ కాలువలో వ్యక్తి గల్లంతు

గడివేముల, ఆగస్టు 19: ఎస్సార్బీసీ కాలువలో వ్యక్తి గల్లంతయ్యాడు. ఈ సంఘటన మండలంలోని మంచాలకట్ట గ్రామ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మిద్దూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన కృష్ణమూరి సోమవారం సాయంత్రం ఎస్సార్బీసీ కాలువలో కొట్టుకపోతుండగా గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. బంధువులు ఎస్ఆర్‌బీసీ వెంట గాలింపు చేపట్టారు. ఘటన వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్



మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

కర్నూలు(ఎడ్యుకేషన్), ఆగస్టు 19: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. సోమవారం జగన్నాథ గట్టుపై ఉన్న ఐఐఐటీడీఎం ప్రాంగణంలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు మోటివేషన్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని ఎంచుకుని వాటి సాధన కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. వివిధ రంగాల్లో సాంకేతికత, డేటా విశ్లేషణ, డేటా మైనింగ్, డేటా సైన్స్ ప్రాముఖ్యతను తెలియజేశారు. పట్టుదల, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలతో పాటు కృషి ఉంటే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థుల ఉన్నత చదువులకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. తాను ఎంబీబీఎస్ చేసిన తర్వాత సివిల్స్ ఎంచుకున్న విషయాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం క్యాంపస్‌లోని సదుపాయాలు, ల్యాబొరేటరీలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.గురుమూర్తి, డాక్టర్ సత్యబాబు, అసోసియేట్ డీన్ డాక్టర్ కిషోర్, తాలుకా సీఐ శ్రీధర్, బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన నిందితులకు జైలు

కర్నూలు(లీగల్), ఆగస్టు 19: మహిళను వేధింపులకు గురి చేసిన ఘటనలో ఇద్దరికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ కర్నూలు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ సరోజమ్మ సోమవారం తీర్పునిచ్చారు. నగరంలోని అరోరా నగర్‌కు చెందిన ఓ మహిళను నిందితుడు యాదవ వేణుగోపాల్, కురువ శేఖర్‌బాబులు వేధింపులకు గురి చేశారు. దీంతో ఆమె తన తల్లిదండ్రుల ఇంటికి వెళ్లగా.. నిందితులు 2017 జూన్ 13వ తేదీన ఫిర్యాది ఇంటికి వెళ్లి దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితురాలు మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ కోర్టు తీర్పును వెలువరించింది. ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ విష్ణువర్ధన్ రెడ్డి వాదనలు వినిపించారు.

కౌలు రైతు ఆత్మహత్య

దొర్నిపాడు, ఆగస్టు 19: మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన అల్లూరి రమణ (34) అనే కౌలు రైతు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అల్లూరి రమణ గత కొన్నేళ్లుగా పొలం కౌలుకు తీసుకొని సాగు చేసేవాడు. గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి సరిగా రాక చేసిన అప్పులు అధికమై ఒత్తిడి పెరగడంతో ఆదివారం రాత్రి మనస్తాపంతో ఇంటి బయట ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్ద చనిపోవడంతో భార్య పిల్లలు రోదనలు పలువురిని కలిచి వేసింది. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు కోరారు.


రమణ(ఫైల్)

ఆడబిడ్డల భద్రత అందరి బాధ్యత

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


జూనియర్ డాక్టర్లతో కలిసి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

కర్నూలు, ఆగస్టు 19: ఆడపిల్లలకు భద్రత అనేది కేవలం ఆలోచనే కాదని.. ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పిలుపునిచ్చారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన మృగాలను కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కర్నూలు ఏపీ జూనియర్స్ డాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శనకు ఎమ్మెల్యే గౌరు చరిత, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు హాజరై సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభద్రమ్మ, రాయలసీమ జేఏసీ అధ్యక్షుడు శ్రీరాములు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పార్వతమ్మ, జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు అచ్యుత్, పవన్ కళ్యాణ్, అమూల్య, సింధూజ, శ్రావ్య, మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువ చేసే స్టార్టర్లు, కేబుళ్ల చోరీ

రుద్రవరం, ఆగస్టు 19: మండలంలోని నరసాపురం గ్రామంలో వ్యవసాయ మోటార్ల స్టార్టర్లు, కేబుళ్ల చోరీకి గురైనట్లు సోమవారం సాయంత్రం రైతులు కరణం వెంకోబరావు, సుబ్బయ్య, ఫక్కీరా ఇంకా పలువురు తెలిపారు. పది మోటార్ల వద్ద కేబుల్ వైర్లు, మరో నాలుగు మోటర్ల వద్ద స్టాటర్లు చోరీకి గురయ్యాయని బాధిత రైతులు వాపోయారు. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు.

మహిళ అదృశ్యం

కేసు నమోదు

రుద్రవరం, ఆగస్టు 19 : మండలంలోని మందలూరు గ్రామానికి చెందిన గురురుఖాన్సీ (26) అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్ఐ వరప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ నెల 16న గురురుఖాన్సీ, ఆమె భర్త రాజా ఓబులేసు ఇరువురూ గొడవపడ్డారు. 16న సాయంత్రం నుంచి ఆ మహిళ కనిపించలేదు. ఈ దంపతులకు ఇద్దరు కూతుర్లు కార్తీక, లక్ష్మీకళ్యాణి ఉన్నారు. ఎర్రగుంట్లకు బయల్దేరి ఇక తిరిగి రాలేదని బాధితురాలి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నటు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలి



రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో మేరీ

కొత్తపల్లి, ఆగస్టు 19: రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని ఎంపీడీవో మేరీ అన్నారు. సోమవారం కొత్తపల్లిలోని ఉపాధి కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో మేరీ ఉపాధి అధికారులతో కలిసి రైతులకు రకాల పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని 30 మంది రైతులకు 47 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేసుకునేందుకు మొక్కలు పంపిణీ చేశామన్నారు. మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత అంతర్ పంటలు కూడా సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రేష్మా, ఐటీడీఏ ఏపీవో రాజునాయక్, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

కోటేష్‌కు ఫొటోగ్రఫీ దినోత్సవ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కోటేష్

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 19: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్, కళారాధన కార్యాలయంలో సోమవారం చింతలపల్లె కోటేష్‌కు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు లయన్ రవికృష్ణ మాట్లాడారు. కోటేష్ చిత్రకారుడిగా సామాజిక, సమకాలీన అంశాలపై తన కుంచెతో చైతన్యం కలిగించే చిత్రాలు వేశారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వ కళారత్న హంస పురస్కారాన్ని అందుకున్న కోటేష్ నంద్యాలకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫొటోగ్రఫీ డే

ఆత్మకూరు, ఆగస్టు 19: ఆత్మకూరు పట్టణంలో సోమవారం అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఫొటో, వీడియో గ్రాఫర్లు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ జాక్వియస్ చిత్రపటానికి ఆత్మకూరు ఫొటో అసోషియేషన్ ప్రతినిధులు శివగౌడ్, కిట్టు, నారాయణ, పల్లె చంద్రశేఖర్, రంగస్వామి, అశ్వక్, మధు, శ్రీహరి, నజీర్ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

వెలుగోడు: సృష్టికి ప్రతిసృష్టే ఫొటోగ్రఫీ అని వెలుగోడు మండల ఫోటోగ్రాఫర్స్ అసోషియేషన్ అధ్యక్షులు రహమాన్, సీనియర్ ఫొటోగ్రాఫర్ రామలింగం అన్నారు. సోమవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ రసూల్, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, తిరుపాల్, లింగస్వామి, హుసేన్, శేఖర్, మహ్మద్ హుసేన్, మల్లి, మురళి, షఫి పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత దాడులు

నంద్యాల క్రైం, ఆగస్టు 19 : ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు సోమవారం జిల్లా వ్యాప్తంగా విస్తృతదాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. నాటుసారా బట్టీలపై చేసిన దాడుల్లో 3 కేసులు నమోదు చేసి 20లీటర్ల సారాను, ఏడు బీరు బాటిళ్లు, 48టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 3డీపీఎల్ కేసులు నమోదు చేసి 11.68లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకోవడంతోపాటు ఒక ఎన్‌డీపీఎల్ కేసు నమోదు చేసి సుమారు 8.64లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా బహిరంగ మద్యం సేవిస్తున్న 89మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం



వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 19: వయనాడ్ వరద బాధితులను అండగా నిలుద్దామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. సోమవారం ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్‌లో వరద విరాళాల సేకరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులను మానవతా దృక్పతంతో ఆదుకోవాలని అన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన టీడీపీ నాయకులు

పాములపాడు, ఆగస్టు 19: మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల అధికారులను మండల టీడీపీ నాయకులు కలిశారు. సోమవారం పాములపాడులోని తహసీల్దార్ కార్యలయంలో తహసీల్దార్ సుభద్రమ్మ, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సురేశ్ కుమార్, ఎంపీడీవో గోపీక్రిష్ణను లింగాల సర్పంచ్ మల్లీశ్వరరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు స్వాములు, ఉప సర్పంచ్ రంగస్వామి, ఆంజనేయులు, రఘుస్వామిరెడ్డి, హరిబాబు, వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 19: విద్యార్థులు ఉన్న తస్థాయికి ఎదగాలని నేషనల్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ అన్నారు. సోమవారం కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరం డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఓరియెంటేషన్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ సమయాన్ని వృథా చేసుకోకుండా ఇప్పటి నుంచే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్

ఘనంగా రక్షాబంధన్



యోగా కేంద్రంలో రాఖీలు కడుతున్న యోగా సభ్యులు



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి సంస్థ నిర్వాహకులు

నంద్యాల (కల్చరల్), ఆగస్టు 19: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోదర ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ సాంప్రదాయ విలువలను ఉట్టిపడేలా చేస్తుందన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకులు కలెక్టర్ రాజకుమారికి సోమవారం



ఆత్మకూరులో డీఎస్పీకి రాఖీ కడుతున్న విద్యార్థినులు

రాఖీ కట్టారు. కలెక్టర్‌తోపాటు, జేసీ, డీఆర్వోలు రక్షాబంధనాన్ని చేతికి ధరించి మనసును జ్ఞానం, పవిత్రత, శాంతి, ప్రేమ, సంతోషం, ఆనందం, శక్తి తదితర సప్తరంగులతో నింపుకోవాలని వారు సూచించారు.

● అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త అన్నారు. సోమవారం ఆయుష్ యోగా కేంద్రంలో నిర్వహించిన రాఖీ పౌర్ణమి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌లాల్, రిటైర్డు తహశీల్‌దార్ జనార్దన్‌శెట్టి, లాయర్ దుర్గాప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్ గురూజీ మాట్లాడుతూ రక్షాబంధన్ సోదర సోదరీమణుల మధ్య ప్రేమాభిమానాలను పటిష్ఠ పరుస్తుందన్నారు. బాల అకాడమీల చిన్నారులు రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాధవీలత, కరస్పాండెంట్ రవీంద్రనాథ్‌లు చిన్నారులకు రాఖీ పండుగ విశిష్టతను తెలిపారు. బాలికలు, బాలురకు రక్షణ కంకణాలు ఆశీర్వదించారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం రాఖీ పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. అక్కా చెల్లెళ్లు అన్న తమ్ములకు మిఠాయిలు తినిపించి రాఖీలు కట్టారు. రాజరాజేశ్వరి హైస్కూల్‌లో విద్యార్థులకు రాఖీలు కట్టారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు రాఖీ పండుగ విశిష్టత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి హైస్కూల్ అకాడమిక్ డైరెక్టర్ బీఎన్ రాఘవేంద్రరావు పాల్గొన్నారు.



బాలఅకాడమీలో రాఖీలు కడుతున్న చిన్నారులు

వెలుగోడు: వెలుగోడు పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాలలో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అన్నా తమ్ముళ్లకు అక్కా చెల్లెల్లు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. అన్న చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా రాఖీ వేడుకలను నిర్వహించుకున్నారు.

ఆత్మకూరు: రక్షాబంధన్ వేడుకను పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు డీఎస్పీ రామాంజీనాయక్‌కు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో సాయి, ప్రశాంత్, అంజి, బాబు, దిలీప్ తదితరులు ఉన్నారు.

మహానందిలో మహాలక్ష్మి యాగం

మహానంది, ఆగస్టు 19: లోక కల్యాణార్థం మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్‌లోని మరకత లింగేశ్వరుని ఆలయంలో వైభవంగా మహాలక్ష్మి యాగ ఆలయ నిర్మాణ కర్త కనుమర్ల పూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు నిర్వహించారు. శ్రావణ పౌర్ణమి పురష్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో 30 హోమగుండాలను ఏర్పాటు చేశారు. అనంతరం హాజరైన దంపతుల చేత గణపతి పూజ, పుణ్యాహవాచనంతోపాటు నిత్య హోమాలను వేదమంత్రాలతో జరిపారు. అనంతరం మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో గిద్దలూరు టీడీపీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, లక్ష్మి దంపతులతోపాటు శ్రీశైలం నియోజకవర్గం టీడీపీ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి, రోటరీ ఇంటర్ నేషనల్ మాజీ గవర్నర్ కందుకూరి శ్రీరామమూర్తి, విజయలక్ష్మి దంపతులతో పాటు వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిపారు.



మహాలక్ష్మి యాగంలో పాల్గొన్న దంపతులు

డ్రైనేజీ నిర్మించండి

ఎమ్మెల్యేను కోరిన మహిళ



ఎమ్మెల్యేకు సమస్యను తెలుపుతున్న మహిళ

నందికొట్కూరు, ఆగస్టు 19: డ్రైనేజీ నిర్మించి పుణ్యం కట్టుకోవాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యకు పట్టణంలోని ఓ మహిళ విన్నవించారు. సోమవారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పట్టణంలోని 15వ వార్డు నాయకులు గోవర్ధనగిరి, బ్రహ్మయ్య ఆచారిల ఆధ్వర్యంలో పర్యటించారు. సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వీధి లైట్లు పడడం లేదని, రోడ్డు వేయాలని, ఇంటి స్థలాలు ఇప్పించాలని, డ్రైనేజీ కాలువల్లో మురుగు వెళ్లడం లేదంటూ పలు రకాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ విద్యుత్ ట్రాన్స్ ఫారమ్‌కు సేఫ్టీ గాడ్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బైరెడ్డి నగర్‌లో గుడిసెలు వేసుకున్నామని వాటికి పట్టాలు ఇప్పించాలని పలువురు ఎమ్మెల్యేను కోరారు. వార్డు కౌన్సిలర్ కృష్ణవేణితోపాటు మరి కొంతమంది మహిళలు ఎమ్మెల్యే రాఖీ కట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రబ్బాని, వార్డు కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, జాకీర్ హుస్సేన్, కృష్ణవేణి, చిన్నరాజు, టీడీపీ నాయకులు ముర్తుజావలి పాల్గొన్నారు.

వార్డు సభ్యులు టీడీపీలో చేరిక: నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, గ్రామ వార్డు సభ్యులు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో టీడీపీలో చేరారు. బ్రాహ్మణకొట్కూరు గ్రామానికి చెందిన 11వ వార్డు సభ్యుడు లక్ష్మన్న, 14వ వార్డు సభ్యుడు ఏసురత్నంతో పాటు వైసీపీ నాయకులు మధు, ఖాదర్, సురేష్ తదితరులు టీడీపీలో చేరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు

పాములపాడు, ఆగస్టు 19: పాములపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్ సబ్జెక్టును బోధించేందుకు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంబంధిత సబ్జెక్టులో పీజీలో 50 శాతం మార్కులు వచ్చి ఉండాలని అన్నారు. పదవీ విరమణ చేసిన అధ్యాపకులు, ఉపాధ్యా యులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని, 22న ఒరిజనల్ సర్టిఫికెట్స్ తీసుకొని హాజరు కావాలని కోరారు. నియమితులైన అధ్యాపకులకు గంటకు రూ.150 ప్రకారం వేతనం ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు 9441510177 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

జామ చెట్ల నరికివేత

గడివేముల, ఆగస్టు 19: గడివేములకు చెందిన ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి తన పొలంలో సాగు చేసిన జామ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి పొలంలో రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు 27 జామ చెట్లను నరికి వేశారని అన్నారు. దీంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి జైలు

నంద్యాల క్రైం, ఆగస్టు 19: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి న్యాయస్థానం పది రోజుల జైలు శిక్ష విధించినట్లు సోమవారం నంద్యాల టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపారు. పట్టణంలోని సాయిబాబా నగర్ దగ్గర నంద్యాల టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ సిబ్బందితో డ్రంకెన్ డ్రైవ్ చెకింగ్ చేస్తుండగా విశ్వనగర్‌కు చెందిన సుమంత్ ఆచారి అనే వ్యక్తి మద్యం సేవించి రోడ్డుపై వాహనం నడుపుతూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. అతడిపై కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేసి నంద్యాల సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్.రామభూపాల్‌రెడ్డి ఎదుట హాజరు పరచగా నిందితుడికి పది రోజుల జైలు శిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నంద్యాల (నూనెపల్లె), ఆగస్టు 19: నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేపట్టారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఓ గదిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ ఇస్మాయిల్, సిబ్బంది దాడులు చేశారు. ఈ దాడిలో 16 మందిని అదుపులోకి తసుకుని వారి వద్ద ఉన్న రూ73,240, 13 సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రూరల్ సీఐగా టి.సుబ్రమణ్యం

నందికొట్కూరు, ఆగస్టు 19: నందికొట్కూరు రూరల్ సీఐగా టి.సుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. సుబ్రమణ్యం అనంతపురం జిల్లా ధర్మవరంలో సీఐగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో నందికొట్కూరు రూరల్ సి.ఐగా నియమితులయ్యారు. దీంతో సోమవారం ఆయన రూరల్ సి.ఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ బీఆర్ కృష్ణయ్య వీఆర్‌కు వెళ్లారు.

ఎస్ఐగా జగన్ మోహన్

బండిఆత్మకూరు, ఆగస్టు 19: బండిఆత్మకూరు సబ్ఇన్‌స్పెక్టర్ ఎం.జగన్‌మోహన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ మల్లికార్జున కృష్ణగిరి మండలానికి బదిలీ కాగా, మిడ్తూరు స్టేషన్‌లో పనిచేస్తున్న జగన్ మోహన్‌ను బండిఆత్మకూరుకు నియమించారు. ఈ మేరకు ఆయన ఎస్ఐగా బాధ్యతలు తీసుకున్నారు.

గడివేములకు నాగార్జునరెడ్డి

గడివేముల, ఆగస్టు 19: గడివేముల ఎస్ఐగా నాగార్జునరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గోస్పాడులో విధులు నిర్వహించి బదిలీల్లో భాగంగా గడివేములకు బదిలీ అయ్యారు. అనంతరం గడివేముల హైస్కూల్‌లో విద్యార్థులకు డ్రగ్స్‌పైన అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలు విక్రయించినా, వాడినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు అడిట్ కాకూడదని అన్నారు.

గోస్పాడుకు వెంకట ప్రసాద్

గోస్పాడు, ఆగస్టు 19 : గోస్పాడు ఎస్ఐగా వెంకట ప్రసాద్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న నాగార్జునరెడ్డి గడివేముల పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించవద్దని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఉంటుందని అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ వెంకట ప్రసాద్‌ను పలువురు నాయకులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

ఎస్ఐని కలిసిన నాయకులు

మహానంది, ఆగస్టు 19 : మహానంది ఎస్ఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్ రెడ్డిని సోమవారం మహానంది మండల టీడీపీ నాయకులు కలిశారు. ఎస్ఐని మండల టీడీపీ అధ్యక్షులు మధు, అశోక్, టీడీపీ పార్లమెంట్ నంద్యాల యువత కార్యదర్శి క్రాంతికుమార్, గోపవరం గని చిన్న రంగస్వామి, మాజీ ఎంపీటీసీ కృపవరంతోపాటు పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



పటేల్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నందికొట్కూరు, ఆగస్టు 19: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచార, హత్య ఘటనకు నిరసనగా నందికొట్కూరు మండల ఉర్దూ పాఠశాల స్కూల్ కాంప్లెక్సు ఉపాధ్యాయులు, భోజన విరామ సమంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పటేల్ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీడీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం ఏసేపు మాట్లాడుతూ డ్యూటీ డాక్టర్లు, ఉద్యోగులకు పటిష్ఠ భద్రత కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ప్రసాదరావు, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరమ్మ, గీత, రేచల్, అరుణ్, రెహానా బేగం, ఆస్మ తదితరులు పాల్గొన్నారు.

● కోల్‌కత్తా ఘటనపై నందికొట్కూరు న్యాయవాదుల సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ సోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు ఖండించారు.

కోల్‌కతా ఘటనపై విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ఆర్ఎంపీ వైద్యులు

గడివేముల, ఆగస్టు 19: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గడివేముల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు విక్టర్ ఇమ్మానుయేల్ అన్నారు. జూనియర్ డాక్టర్ హత్యను నిరసిస్తూ సోమవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ నుంచి గడివేముల పాతబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ ర్యాలీకి ఆర్ఎంపీ యూనియన్ వైద్యులు, టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యులు కృష్ణయ్య, అనంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

మిడుతూరు, ఆగస్టు 19: మిడుతూరు మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా, వైస్ పిన్సిపాల్ గోవిందు, వైస్ ఛైర్మన్ శివపార్వతిలు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. కాతా రమేష్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో వంగాల శివరామిరెడ్డి, వంగాల రమణరెడ్డి పాల్గొన్నారు.

భారత్ బంద్ పోస్టర్లు విడుదల



భారత్ బంద్ పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

మిడుతూరు, ఆగస్టు 19 : భారత్ బంద్ పోస్టర్లను మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రాజకుమార్ అడ్వకేట్ బంగి సుధీర్, ఎస్సీ, ఎస్టీ జిల్లా పరిరక్షణ సమితి అధ్యక్షుడు వేల్పుల విజయ్, గద్దా నాగమద్దయ్య సోమవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21న బంద్ చేపడుతున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు.

నేరాల నియంత్రణకు చర్యలు



ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఆగస్టు 19 : జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్లలో గల వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సోమవారం పోలీస్ అధికారులు నేరాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని విద్యాలయాలు, ముఖ్య కూడళ్లలో మాదకద్రవ్యాల వాడకం, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలను ప్రజలకు వివరించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. మహిళలపై జరిగే నేరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు తదితర వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అప్రమత్తంగా ఉండాలని కోరారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

ఆత్మకూరు, ఆగస్టు 19: మండలంలోని కొట్టాలచెరువు గ్రామంలో ఓ వివాదాస్పద స్థలంపై నెలకొన్న సమస్యను పరిష్కరించాలని సోమవారం గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గ్రామంలో తులసీబాయి అనే మహిళ ఐదు సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నకిలీ ఇంటి పట్టా సృష్టించుకుందని అన్నారు. ఆదివారం రాత్రి గ్రామస్థులు ఏకమై తులసీబాయి ఆక్రమించిన స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును తొలగించే ప్రయత్నం చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని సమస్యను సద్దుమణిచారు. సోమవారం గ్రామస్థులంతా ఏకమై తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. తహసీల్దార్ రత్నరాధిక మాట్లాడుతూ ఇటీవల తులసీబాయికి ఇంటి పట్టాతోపాటు ఇల్లు మంజూరు చేశామని అన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కొట్టాలచెరువు గ్రామస్థులు

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ఘనంగా రక్షాబంధన్


నారా లోకేశ్‌కు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

చాగలమర్రి, ఆగస్టు 19: చాగలమర్రిలోని ఆయా పాఠశాలల్లో సోమవారం రాఖీ పండుగను ఘనంగా నిర్వహించారు. భారతీ విద్యామందిరంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం ప్రసాదు ఆధ్వర్యంలో విద్యార్థులు రాఖీలు కట్టుకొని రక్షాబంధన్ పండగ చేశారు. అనంతరం పోలీసు స్టేష న్, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు విద్యార్థులు వెళ్లి రాఖీలు కట్టారు. ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, కార్యదర్శి సుబ్బారావు, ప్రభాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: విజయవాడలోని మంత్రి నారా లోకేశ్ స్వగృహంలో సోమవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమ అఖిలప్రియ ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె నారా లోకేశ్‌కు రాఖీ కట్టారు.

డోన్(రూరల్): పట్టణంలో రాఖీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని బ్రహ్మ కుమారీలు(ఓం శాంతి స భ్యులు) లక్ష్మక్క ఆధ్వర్యంలో పెన్షనర్ల కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు కేఎస్ భాను సింగ్, నాయకులు సుబ్బరా యుడు, గోపాల్, గాలయ్య, దాసప్పలకు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

ప్యాపిలి: మండలంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్యాపిలి పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో అన్నా చెల్లెలు, అక్కా తమ్ముళ్లు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదాలు పొందారు.

కొలిమిగుండ్ల: మండలంలోని గ్రామాల్లో రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు, ప్రముఖులు అన్న తేడా లేకుండా సోదరీ మణులు, సోదరులకు రాఖీలు కట్టి, శుభాకాంక్షలు తెలిపి, ఆశీర్వాదాలు పొందారు. శ్రావణమాసం పౌర్ణమిను పురస్కరించుకొని వివిధ గ్రామాల ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్ల లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలో రక్షాబంధన్ వేడుకలు జరుపుకున్నారు. అన్నలు, తమ్ముళ్లకు అక్కలు, చెల్లెళ్లు రాఖీలు కట్టి ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం వారికి కానుకలు అందజేశారు.

కోవెలకుంట్ల ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి

కోవెలకుంట్ల, ఆగస్టు 19: కోవెలకుంట్ల ఎస్ఐగా మల్లికార్జున రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసే ఎస్ఐ వరప్రసాద్ రుద్రవరం పోలీసుస్టేషన్‌కు బదిలీ కాగా అన్నమయ్య జిల్లాలో పనిచేసే మల్లికార్జునరెడ్డిని కోవెలకుంట్లకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ మట్కా,పేకాట, మద్యం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేవనూరు ఎస్ఐగా భూపాలుడు : రేవనూరు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ భూపాలుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రేవనూరులో పనిచేసే ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని మహానందికి, వెలుగోడులో పనిచేసే ఎస్ఐ భూపాలుడిని రేవనూరుకు బదిలీ చేస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు భూపాలుడు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

నందివర్గం ఎస్ఐగా వెంకటసుబ్బయ్య

బనగానపల్లె: నందివర్గం ఎస్ఐగా వెంకటసుబ్బయ్య సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తిరుపాలు నంది కొట్కూరు నియోజకవర్గంలోని బ్రాహ్మణకొట్కూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో గడివేముల ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య నందివర్గానికి బదిలీపై వచ్చారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

చాగలమర్రి, ఆగస్టు 19: యువత మాదవక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సురేష్‌రెడ్డి సూచించారు. సోమవారం చాగలమర్రి వాసవీ జూనియర్ కళాశాలలో మహిళల భద్రత, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని అన్నారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రిన్సిపాల్ ఓబులేసు, ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

నందవరంలో చండీహోమం

బనగానపల్లె, ఆగస్టు 19: మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరీమాత ఆలయంలో సోమవారం లోకకళ్యాణార్థం చండీహోమం నిర్వహించారు. ఆలయ వేద పండితులు పవన్‌కుమార్ శర్మ, అర్చకులు ప్రదీప్‌కుమార్ శర్మ, రామకృష్ణశర్మల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కామేశ్వ రమ్మ, మాజీ ఛైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

'గ్రామాభివృద్ధికి సహకరిస్తాం'

శిరివెళ్ల, ఆగస్టు 19: శిరివెళ్ల గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని టీడీపీ, బీసీ సంఘం నాయకుడు పీవీ లింగమయ్య, రుద్రవరం మండలం కొండమాయపల్లె మాజీ ఉప సర్పంచ్ బండారు బాలరాజుయాదవ్ అన్నారు. శిరివెళ్ల ఎస్ఐగా చిన్న పీరయ్య బాధ్యతలు చేపట్టడంతో ఆయనను కలిసి శాలువ, పూలమాలతో సోమవారం సన్మానించారు. ప్రజల ప్రశాంతతకు భంగం వాటిల్లకుండా పోలీసులు తీసుకునే చర్యలకు కట్టుబడి ఉంటామని అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొలిమిగుండ్ల, ఆగస్టు 19: మండలంలోని రాఘవరాజుపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నరసింహులు తెలిపారు. గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో టీవీ ధ్వంసం

శిరివెళ్ల, ఆగస్టు 19: మండలంలోని గంగవరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆకతాయిలు విధ్వంసం చేశారు. పాఠశాలలోని టీవీ, స్విచ్ బోర్డులను ధ్వంసం చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆకతాయిలు పాఠశాలలో ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని, తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం శిరివెళ్ల పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

గండికి మరమ్మతులేవీ..?


19వ గంగ ఉపకాల్వకు గండి పడిన దృశ్యం

రుద్రవరం, ఆగస్టు 19: తెలుగుగంగ ప్రధాన కాల్వ చెంతనే ఉన్నా.. సాగునీరు కోసం రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని సోమవారం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గంగబ్లాక్ చానెల్ 19వ ఉప కాల్వకు గండి పడి సుమారు పది రోజులపైనే అయింది. అటు గంగ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. చెంతనే కాలువల్లో సాగు నీరు పారుతున్నా నీరు మాత్రం ఆయకట్టు భూములకు అందడం లేదు. ఈ ఉప కాల్వ కింద వెలగలపల్లె చెరువుకు సాగు నీరు అందాల్సి ఉంది. అప్పనపల్లె, వెలగలపల్లె, కొండమాయపల్లె గ్రామాల రైతుల భూములు ఈ కాల్వ వెంట ఉన్నాయి. సాగు నీరు పుష్కలంగా ఉన్నా ఆయకట్టుకు మాత్రం అందడం లేదని వాపోతున్నారు. సుమారు 500 ఎకరాలకు సాగు నీరందక ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులకు, గంగ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

గాలి వాన బీభత్సం

- పడిపోయిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నిలిచిపోయిన సరఫరా

కొలిమిగుండ్ల, ఆగస్టు 19: మండలంలోని పలు గ్రామాలలో గాలి వాన బీభత్సం సృష్టించింది. సోమవారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా పెద్ద పెద్ద శబ్దాలతో ఉరుములు, గాలితో చిన్నపాటి వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల పొలాల్లో పిడుగులు పడగా, మండలంలోని బెలుంశింగవరం, ఇలిక్యాల, కొలిమిగుండ్ల గ్రామాల్లో చెట్లు నెలకొరిగాయి. చెట్లు కూలి విద్యుత్ స్థంభాలపై పడి స్తంభాలు పడిపోయాయి. దీంతో ఆయా గ్రామాలు, కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బెలుంశింగవరం, కొలి మిగుండ్ల గ్రామాల్లో పెద్ద ప్రమాదం తప్పిం దని సమీప ప్రాంత ప్రజలు వాపోయారు.


ఆలయంలోకి చేరిన వర్షపు నీరు

ఆలయంలోకి ప్రవేశించిన వర్షపు నీరు: కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామంలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి సిద్ద రామేశ్వరస్వామి ఆలయంలోకి వర్షపు నీరు ప్రవేశించింది. దీంతో స్వామి వారికి ఉపయోగించే పూజా సామగ్రి మొత్తం తడిసి పోయిందని అర్చకుడు మహేష్‌శర్మ తెలిపారు. దీంతో పూజలకు, భక్తులకు ఆటంకం ఏర్పడింది.

బేతంచెర్ల: బేతంచెర్ల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పట్టణంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. ఈ వర్షానికి పట్టణంలోని పెద్దబస్టాండు సమీపంలోని డ్రైనేజీ కాలువలు నిండటంతో మురుగు నీరంతా రోడ్లపై పారుతుండటంతో వాహ నదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగునీరు రోడ్లు మీద పారుతుండటంతో వాహనాలపై వెళ్లేవారు జారి పడుతూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు చేస్తున్నారు. నగర పంచాయితీ కార్మికులు సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేస్తే మురుగునీరు రోడ్లపై ఎలా వస్తుందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణంలో ఉన్న సీఐ కార్యాలయంలో నీరు చేరి నీటి కుంటను తలపిస్తోంది. సుమారు 45 నిమిషాలు ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం విధులకు వచ్చిన సీఐ హనుమంతనాయక్ కార్యాలయంలోకి వర్షం నీరు చేరడంతో లోపలికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇటీవల సీఐ కార్యాలయం ముందు ఉన్న రోడ్డును విస్తరణలో భాగంగా ఎత్తు వేయడంతో వర్షం నీరు కార్యాలయంలోకి చేరి నిల్వ ఉంటోంది. అయితే నిల్వ ఉన్న ఈ నీరు బయటికి పోవడా నికి నీరు లేకుండా పోయింది. కాల్వలోని నీటిని మురుగు కాల్వలోకి పంపిం చేందుకు రంధ్రం లేక పోవడంతో కాల్వ ఎత్తు ఉండడంతో నీరు ఎక్కడకు వెళ్లకుండా నీరు నిలిచింది. ఏం చేయాలో దిక్కు తోచక పోలీసులు అయోమయంలో ఉన్నారు.


కొలిమిగుండ్లలో కూలి పోయిన చెట్టు


కోవెలకుంట్ల సీఐ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు

నిందితులను కఠినంగా శిక్షించాలి



కోవెలకుంట్లలో మానవహారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు , చిన్నమల్కాపురంలో..

కోవెలకుంట్ల, ఆగస్టు 19: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సోమవారం కోవెలకుంట్లలో ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్, ప్రజాసంఘాల నేతలు సోమవారం పట్టణంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల్లో నినాదాలు చేస్తూ గ్రామ పంచాయతీ సర్కిల్ వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు, వైద్యులు మాట్లాడుతూ మహిళా వైద్యులపై రోజురోజుకూ అత్యాచారాలు, హత్యలు అధికమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు సుధాకర్, బీసీసంఘం నాయకుడు వడ్డె సుబ్బరాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకుడు కత్తి ఓబులేసు, బుద్దిస్ట్ సొసైటీ నాయకుడు రెడ్డిపల్లె ఓబయ్య, ఎస్ఎఫ్ఐ నాయకుడు మాబు, అంగన్‌వాడీ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి, డాక్టర్లు బాబు, నాగేంద్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డోన్(రూరల్): కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని చిన్న మల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చెన్నకేశవులు డిమాండ్ చేశారు. సోమవారం చిన్న మల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్యసిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సరోజమ్మ, ప్రభాకర్, చెన్నయ్య, విజయలక్ష్మి, ఆనంద్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి దీపోత్సవం


రామలింగేశ్వర ఆలయంలో దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

చాగలమర్రి, ఆగస్టు 19: చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం రాత్రి మహిళలు సామూహికంగా దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 108 దీపాలు వెలిగించి మహిళలు ప్రత్యేక హారతులు ఇచ్చారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేసి వడిబియ్య కార్యక్రమాన్ని చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

రుద్రవరం, ఆగస్టు 19: గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజలకందుబాటులో ఉండాలని తహసీల్దారు మల్లికార్జునరావు అన్నారు. సోమవారం కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ మధ్యాహ్నం వరకు గ్రామాల్లో ప్రజలకందుబాటులో ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మహబూబ్‌బాషా, వీఆర్వోలు, సర్వేయర్లు ఉన్నారు.

రేవనూరు ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

కోవెలకుంట్ల, ఆగస్టు 19: మండలంలోని రేవనూరు పోలీసు స్టేషన్‌లో నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన భూపాలుడును సోమవారం టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, మాజీ సర్పంచ్ నాగహుసేనీలు కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రశాంత వాతావ రణం లో ప్రజలు జీవించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ప్రపంచ శాంతి కోసం పాదయాత్ర

చాగలమర్రి, ఆగస్టు 19: ప్రపంచ శాంతి కోసం పాదయాత్ర చేపట్టినట్లు వెంకటేశ్వర భక్తబృందం అధ్యక్షుడు సీసాల రాజు తెలిపారు. సోమవారం పటాన్ చెరువు నుంచి తిరుమలకు 30 మంది మహా పాదయాత్రగా వెళ్లా సోమవారం చాగలమర్రిలోని చాగలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీసాల రాజు మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా ఉండాలని, వర్షాలు కురిసి పంటలు సుభిక్షంగా పండాలని కోరుకుంటూ యాత్ర చేస్తున్నామని అన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

చాగలమర్రి, ఆగస్టు 19: చాగలమర్రిలోని బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సార్వత్రిక విద్య, ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల, హెచ్‌ఎంలు కోటయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థుల కోసం సార్వత్రిక విద్య, ఓపెన్‌స్కూల్ విద్యావిధానాన్ని ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు. అనంతరం బాలుర, బాలికోన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు. విద్యార్థులకు సులభ శైలిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు మెలకువలను తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రమశిక్షణ ఉండాలి

ఉయ్యాలవాడ, ఆగస్టు 19: విద్యార్థులు విద్యతోపాటు క్రమ శిక్షణ కలిగి ఉండాలని ఎస్ఐ రామాంజనేయరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోటి విద్యార్థులను గౌరవించాలన్నారు. విద్యార్థినులు యూవ్‌టీజింగ్‌కు గురి కాకుండా పోలీసులను ఆశ్రయించాలన్నారు. అసాంఘిక శక్తులకు పాల్పడిన వారి సమాచారం తమకు ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి మత్తుకు గురి కావద్దన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

వైసీపీకి కంబగిరిస్వామి రాజీనామా

అవుకు, ఆగస్టు 19: అవుకు మండలం చెర్లోపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు కొమ్మిసాని కంబగిరిస్వామి వైసీపీకి రాజీనామా చేసినట్లు సోమవారం తెలిపారు. దీంతో చెర్లోపల్లెలో వైసీపీకి భారీ షాక్ తగిలినట్లయింది. ఈ సందర్భంగా కంబగిరిస్వామి మాట్లాడుతూ 2013 నుంచి ఇప్పటి వరకు వైసీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యునిగా పని చేశానన్నారు. ప్రత్యేక కారణాలతో పార్టీ పదవికి, సభ్య త్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

గొడవలకు పాల్పడితే చర్యలు


గామస్థులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

శిరివెళ్ల, ఆగస్టు 19: మండలంలోని గోవిందపల్లెలో గొడవలకు పాల్పడితే కఠిన తీసుకుంటామని నంద్యాల ఫ్యాక్షన్ జోన్ సీఐ ప్రభాకర్‌రెడ్డి, శిరివెళ్ల సీఐ వంశీధర్, ఎస్ఐ చిన్నపీరయ్య హెచ్చరించారు. గోవిందపల్లె గ్రామస్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. క్షణికావేశంతో గొడవలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కొని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కుటుంబం, గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. గ్రామాల్లో అలజడులు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని అన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి: తహసీల్దార్

బేతంచెర్ల, ఆగస్టు 19: మండలంలోని గ్రామాల్లో మంగళవారం నుంచి నిర్వహించే ఓటరు సర్వేను బీఎల్వోలు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ సూర్యప్రకాష్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం తహ సీల్దార్ కార్యాలయంలో డిటీ మధు అధ్యక్షతన బీఎల్వోల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్వోలు ఇంటింటి సర్వేలో తప్పులు ఒప్పులు లేకుండా నిర్వహించాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక వెలవెల

చాగలమర్రి, ఆగస్టు 19: చాగలమర్రిలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం వెలవెలబోయింది. ఫైబర్ నెట్ పని చేయకపోవడంతో ఆయా శాఖల అధికారులు వెళ్లిపోయారు. ఇన్‌చార్జి తహసీల్దార్ విజయ్‌కుమార్ ఒక్కరే ఉండిపోయారు. మధ్యాహ్నం తరువాత నుంచి నెట్ పని చేయడంతో ప్రజా వేదిక కొనసాగించామని తెలిపారు. నాలుగు నెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతోనే నెట్ నిలిపి వేసినట్లు తెలిసింది.

అధికారులను కలిసిన మాలమహాసేన నాయకులు

రుద్రవరం, ఆగస్టు 19: రుద్రవరం మండలంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన అధికారులను సోమవారం మాలమహాసేన నాయకులు వెంకటేశ్వర్లు కలిశారు. తహసీల్దారు మల్లిఖార్జునరావు, ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ వరప్రసాద్‌లకు పూలమాలలు వేసి శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ మాలమహాసేన అధ్యక్షులు గుర్రం ప్రభాకర్, రుద్రవరం అధ్యక్షులు వెంకటేశ్వర్లు కమిటి సభ్యులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్ ప్రారంభం

కొలిమిగుండ్ల, ఆగస్టు 19: మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఆదేశాలతో బనగానపల్లె నుంచి వయా పెట్నీకోట, గోర్విమానుపల్లె గ్రామాల మీదుగా తాడిపత్రికి నూతన బస్సు సర్వీసు సోమవారం ప్రారంభమైంది. మండల టీడీపీ అధ్యక్షుడు మూలే రామేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుస్సేన్‌రెడ్డి, మూలే హుస్సేన్‌రెడ్డి, సత్యంరెడ్డి తదితరులు పూజలు నిర్వహించి నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు.

'గ్రామ సమస్యలను గుర్తించండి'


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమమహేశ్వరరావు

ఉయ్యాలవాడ, ఆగస్టు 19: మండలంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించాలని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన గ్రామ సభ ఏర్పాటు చేసి మౌలిక వసతుల నిర్మూలనపై చర్చించి గ్రామసభ తీర్మానం చేయాలన్నారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే నిర్వహించాలని అన్నారు. 15 రోజులకోసారి గ్రామాల్లోని ఓహెచ్ఎస్సార్ ట్యాంకులను, నీటి తొట్లను శుభ్రం చేయాన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మహిందర్‌రెడ్డి, ఉపాధి ఏపీవో రవిప్రకాష్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యం


మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి

చాగలమర్రి, ఆగస్టు 19: కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యమని జిల్లా నోడల్ అధికారి జగదీష్‌చంద్రారెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రి, ముత్యాలపాడు ప్రభుత్వ వైద్యశాలలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. పెద్దబోదనం గ్రామంలో ఏర్పాటు చేసిన ఎఫ్‌డీపీ ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 40 రోజుల పాటు జరిగిన కుష్టు వ్యాధి ఇంటింటి సర్వేలో 8 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. వైద్యులు ఇమ్రాన్, శివమోహన్, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్‌వో వెంకటమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఊయలసేవ


చౌడేశ్వరి మాతకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె, ఆగస్టు 19: మండలంలోని నందవరం చౌడేశ్వరి మాత ఆలయంలో సోమవారం సహస్ర దీపాలంకరణ, పల్లకిసేవ, ఊయలసేవ కార్యక్రమాలు అర్చకులు నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

అమ్మవారికి కానుకగా నక్షత్ర హారతి, ముక్కుపుడక


వెండి నక్షత్రహారతి, బంగారు ముక్కుపుడకను అందజేస్తున్న భక్తులు

బనగానపల్లె, ఆగస్టు 19: నందవరం చౌడేశ్వరీమాతకు సోమవారం హైదరాబాదుకు చెందిన వర్చ్యువల్ ఆటోమెషన్స్ వ్యాపార సంస్థ యజమానులు రూ.1.33 లక్షల విలువ చేసే 1465 గ్రాముల వెండి నక్షత్ర హారతి, అలాగే 39,500 విలువగల 4.830 గ్రాముల ముక్కుపుడకను సోమవారం విరాళంగా అందించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, ఆలయ పండితులకు, అర్చకులకు అందించారు.

ఉపాధి పథకంపై డిప్యూటీ సీఎం కీలక ఆదేశాలు

కొలిమిగుండ్ల, ఆగస్టు 19: గ్రామాల అభివృద్ధిలో అత్యంత కీలకమైన ఉపాధి హామీ పథకంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అధికారులకు కీలక ఆదేశాలు జారీచేశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయా శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు పలు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీచేశారు.

రుద్రవరం: పంచాయతీల అబివృద్ధికి పాటుపడాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచించారు. మండల పరిషత్‌లో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు పాల్గొన్నారు. పంచాయతీల అభివృద్ధిపై నిర్లక్ష్యం వద్దని సూచించారు. పంచాయతీల అభివృద్ధిలో ప్రజల సహకారం తీసుకోవాలని కార్యదర్శులను ఎంపీడీవో మధుసూదనరెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డి శ్రీనివాసశర్మ, ఏవో వరలక్ష్మి, ఏఈ, జేఈ వెంకటరాముడు, ప్రమోద్, ఏపీవో ప్రతాప్, వీసీ సుబ్బన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం

డోన్(రూరల్), ఆగస్టు 19: పట్టణంలోని గాయత్రీ పీఠంలో సోమవారం రాత్రి అర్చక పురోహితుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. వేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, శతావధాని దత్తాత్రేయ శర్మ హాజరయ్యారు. వేద గాయత్రీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అర్చక పురోహితులు, సీఐ ఇంతియాజ్ బాషాను, పట్టణ ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి, శతావధాని దత్తాత్రేయ శర్మలను శాలువ పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ ఆలయాల అర్చకులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రత


సంజీవనగర్‌లో తాగునీటి ట్యాంకు వద్ద పాచి పట్టిన దృశ్యం

బేతంచెర్ల, ఆగస్టు 19: పట్టణంలోని సంజీవనగర్ కాలనీలో ఉన్న తాగునీటి ట్యాంకు కింద ప్లాట్‌ఫారం అంతా పాచితో పేరుకుపోయింది. దీంతో తాగునీరు తెచ్చుకోవడానికి వెళ్లిన గ్రామస్థులు అక్కడ పాచి మీద కాలుజారి పడి గాయాలపాలవుతున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. సంజీవనగర్ కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకును నగరపంచాయతీ అధికారులు శుభ్రం చేయించకపోవడంతో పాచి పేరుకుపోయిందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.